క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

రామచంద్రాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మహ్మద్ రఫీ తెలిపారు. మంగళవారం కార్యాలయ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ వివిధ శాఖల అభివృద్ధిపై సమీక్ష చేయనున్నట్లు చెప్పారు. సంబంధిత శాఖల్లోని అధికారులు పూర్తి నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

వేదాంతపురం సర్పంచ్‌గా జనార్దన్‌యాదవ్



తిరుపతి రూరల్: వేదాంతపురం సర్పంచ్‌గా చెరుకుల జనార్దన్‌యాదవ్ నియమితులయ్యారు. ఆమేరకు జిల్లా పంచాయతీ అధికారి రాజశేఖర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. నేడు ఆయన సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుతం సర్పంచ్‌గా ఉన్న తోట చిరంజీవిరెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను ఆమోదించిన డీపీఓ ప్రస్తుతం పంచాయతీ ఉపసర్పంచ్‌గా ఉన్న జనార్దన్‌యాదవ్‌కు పూర్తి అదనపు బాధ్యతలతో సర్పంచ్‌గా నియమిస్తూ డీపీఓ ఉత్తర్వులు జారీ చేశారు. జనార్దన్ యాదవ్‌ను పలు వురు అభినందించారు.

సొమ్ము చెల్లించకుంటే ఏడాది జైలు

తిరుపతి లీగల్: చెక్‌బౌన్స్ కేసులో చెక్కు సొమ్ముతో పాటు ఇతర కొంత సొమ్మును నెలలోపు చెల్లించకుంటే ఏడాది జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తిరుపతి ఆరవ అదనపు జూనియర్ జడ్జి కోర్టు మంగళవారం తీర్పు చెప్పింది. ఫిర్యాది తరపు న్యాయవాదులు సి.విజయ్‌కుమార్, రాజశేఖర్ తెలిపిన కేసులోని వివరాల మేరకు... పులిచెర్ల, రొంపిచెర్ల క్రాస్ సమీపంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ చిత్తూరు ఎస్‌బీఐ కాలనీలో నివసిస్తున్న పీఎస్.ప్రేమ్‌కృష్ణ తన అవసరాల కోసం తిరుపతి బైరాగిపట్టెడకు చెందిన కె.హేమాద్రి వద్ద 2015 మార్చి 5న రూ.6లక్షలు అప్పుగా తీసుకున్నాడు. దానికిగాను మూడు ప్రోనోట్లను, మూడు చెక్కులను 2016 డిసెంబర్ 14న ఇచ్చాడు. అతను చెక్కులను బ్యాంకులో వేయగా బౌన్స్ అయ్యాయి. దీంతో హేమాద్రి అతనిపై చెక్ బౌన్స్ కేసు దాఖలు చేశాడు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి అసలు, 9శాతం వడ్డీ కలిపి రూ.6లక్షల74 వేలను నిందితుడు ప్రేమ్‌కృష్ణ నెల లోపు చెల్లించాలని తీర్పు చెప్పారు. అలాగే రూ.20 వేలను ప్రభుత్వ ఖజానాలో జమ చేయాలని తీర్పులో పేర్కొన్నారు. చెల్లించకుంటే ఏడాది జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

'కొండ'ంత అభిమానం



చంద్రగిరి: మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఆయనపై ఉన్న కొండంత అభిమానాన్ని చాటుకున్నాడో అభిమాని. 2,388 మెట్లపై పొర్లు దండాలు పెట్టుకుంటూ తిరుమలకు చేరుకున్నాడు. రామచంద్రాపురం మండలం బలిజపల్లికి చెందిన ఈశ్వర్ చిరంజీవికి వీరాభిమాని. మంగళవారం శ్రీవారిమెట్టు మార్గంలో 2,388 మెట్లపై పొర్లుదండాలు పెడుతూ తిరుమలకు చేరుకున్నాడు. ఈశ్వర్ మాట్లాడుతూ 2003వ సంవత్సరం నుంచి చిరంజీవి కుటుంబసభ్యులు ఆయురారోగ్యాలతో ఉండాలని పలు పుణ్యక్షేత్రాల్లో కార్యక్రమాలను నిర్వహిస్తున్నానన్నారు.

సాగులో రైతన్నలు



రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవడంతో పంటలు సాగు చేసుకునేందుకు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతులు రబీ సీజన్లో వరి నాట్లు వేస్తున్నారు. ఆర్‌సీపురం మండలంలో గంగిరెడ్డిపల్లి, వెంకటాపురం, కమ్మపల్లి ప్రాంతాల్లో పంట సాగు చేస్తున్న దృశ్యాలను సాక్షి కెమెరా బంధించింది.

- సాక్షి ఫొటో గ్రాఫర్, తిరుపతి

అభివృద్ధే మా అభిమతం

- సకాలంలో పనులు పూర్తికావాలి
- తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీ నేత గణేష్‌ను పరామర్శిస్తున్న తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



పాడిపేటలో ఓటర్ల సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న మోహిత్‌రెడ్డి, సర్పంచ్ ధనమునిరెడ్డి

తిరుపతి రూరల్: అభివృద్ధే అభిమతంగా, ప్రజాసంక్షేమమే లక్ష్యంగా కృషిచేస్తున్నట్లు తుడా ఛైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తిరుపతి రూరల్ మండలం పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులపై అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి పంచాయతీకి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చొరవతో కోట్లాది నిధులతో అభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అడుగు జాడల్లో నడుస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ, సేవా కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు రానున్న ఎన్నికల్లో తనను ఆదరించి, గెలిపించాలని విన్నవించారు.

ఓటును సద్వినియోగం చేసుకోండి..

ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు 18 ఏళ్లు నిండిన యువత ప్రతిఒక్కరూ ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని మోహిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. పలు పోలింగ్ స్టేషన్లను ఆయన సందర్శించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ...

అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మంగళం-2 ఎంపీటీసీ లక్ష్మి భర్త గణేష్‌ను మంగళంలోని ఆయన ఇంటికి వెళ్లి మోహిత్‌రెడ్డి పరామర్శించారు. మేమంతా ఉన్నామంటూ ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, సిబ్బంది, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

3న ఆడిటోరియం ప్రారంభం



ఆడిటోరియాన్ని పరిశీలిస్తున్న హరిత

తిరుపతి తుడా: తిరుపతి స్మార్ట్ సిటీలో భాగంగా రూ.40 కోట్లతో నిర్మించిన డిస్ట్రిక్ట్ ఆర్ట్ స్టూడియో ఆడిటోరియాన్ని సెప్టెంబర్ 3న ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసినట్లు స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ డి.హరిత తెలిపారు. తుడా ప్రాంగణంలోని డిస్ట్రిక్ట్ ఆర్ట్ స్టూడియో ప్రారంభోత్సవ ఏర్పాట్లను మంగళవారం ఆమె ఇంజినీర్లతో కలిసి పరిశీలించారు. ఆధునిక పరిజ్ఞానంతో ఆడిటోరియాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. చిన్నపాటి పెండింగ్ పనులను ఒకటవ తేదీ కల్లా పూర్తిచేసి ప్రారంభించనున్నట్లు చెప్పారు. మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డీఈ దేవిక పాల్గొన్నారు.

శ్రీనివాస సేతు పనుల పరిశీలన

శ్రీనివాస సేతు ఫ్లైఓవర్ నిర్మాణ పెండింగ్ పనులను స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ డి. హరిత అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఆమె అధికారులతో మాట్లాడుతూ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి వచ్చే నెల 18న ప్రారంభించాలని ఇప్పటికే ప్రకటించారని గుర్తు చేశారు. అనుకున్న సమయానికి పూర్తిస్థాయిలో పనులను చేపట్టి ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అలానే ఫ్లైఓవర్ వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ఫుట్ పాత్ నిర్మాణం, గ్రీనరీ పెంపు పనులను సైతం వచ్చేనెల 15 లోపు పూర్తిచేయాల్సిందేనని ఆదేశించారు. ప్రారంభోత్సవానికి ఆటంకాలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆఫ్కాన్ ప్రతినిధులకు సూచించారు. అలానే కొరమీను గుంట ప్రాంతంలో నిర్మిస్తున్న క్రికెట్ స్టేడియాన్ని పరిశీలించారు. మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డీఈ లు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వెంగమాంబ వర్ధంతి ఉత్సవాలు

తిరుపతి కల్చరల్: తరిగొండ వెంగమాంబ 206వ వర్ధంతి ఉత్సవాలు ఈనెల 24, 25వ తేదీల్లో తరిగొండ, తిరుపతి ప్రాంతాల్లో జరగనున్నాయి. ఇందులోభాగంగా తరిగొండలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో గురువారం సాయంత్రం 5.30 గంటల నుంచి ఆధ్యాత్మిక, భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు శ్రీలక్ష్మీనృసింహస్వామి వారికి కల్యాణోత్సవం, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులతో భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో గురువారం ఉదయం 9 గంటలకు భక్తి సంగీత కార్యక్రమాలు, 10 గంటలకు వెంగమాంబ సాహిత్యంపై సదస్సు నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుంది. అలాగే శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంఆర్ పల్లి సర్కిల్లోని వెంగమాంబ విగ్రహానికి టీటీడీ అధికారులు పుష్పాంజలి ఘటిస్తారు. అనంతరం అన్నమాచార్య కళామందిరంలో ఉదయం 11.30 గంటలకు సంగీత సభ, సాయంత్రం 6 గంటలకు ప్రముఖ కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

గడప గడపలో చెవిరెడ్డి లక్ష్మి



సి.గొల్లపల్లిలో చెవిరెడ్డి లక్ష్మి, వైస్ ఎంపీపీ మాధవరెడ్డి

తిరుపతి రూరల్: చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి తిరుపతి రూరల్ మండలంలో నిర్వహిస్తున్న గడప గడపకు ఆత్మీయ పలకరింపు పండుగ వాతావరణంలో కొనసాగుతోంది. మంగళవారం తిరుపతి రూరల్ మండలం సి.గొల్లపల్లి పంచాయతీలో ఈకార్యక్రమం నిర్వహించారు. రూరల్ మండల వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, సర్పంచ్ రవి ఆధ్వర్యంలో మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆత్మీయ స్వాగతం పలికారు. ముందుగా వైఎస్ విగ్రహానికి నివాళులర్పించారు. మాతమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని మహిళలు గడప గడపలో కర్పూర హారతులతో స్వాగతం పలికి మద్దతు తెలిపారు. చెవిరెడ్డి లక్ష్మి ఇంటింటికి వెళ్లి జగనన్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ, రానున్న ఎన్నికల్లో జగనన్నకు తోడుగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని చంద్రగిరి ఎమ్మెల్యేగా ఆదరించాలని కోరారు. మాజీ సర్పంచ్‌లు విడుదల ప్రభావతి, రంగయ్య పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణ ముఖ్యం

తిరుపతి రూరల్: మామిడిలో సకాలంలో సస్యరక్షణ ముఖ్యమని తిరుపతి ఉద్యానశాఖాధికారి సునీల్ పేర్కొన్నారు. మంగళవారం దుర్గసముద్రంలోని రైతు భరోసా కేంద్రాన్ని ఆయన సందర్శించారు. రైతులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. అనంతరం రైతులతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఆయన మాట్లాడుతూ మామిడిలో కత్తిరింపులు చేపట్టాలన్నారు. కత్తిరింపుల తర్వాత బ్లైటాక్స్ మందును లీటర్ నీటిలో మూడు గ్రాముల చొప్పున కలిపి చెట్లకు పిచికారీ చేయాలని సూచించారు. ఆర్బీకే ఉద్యానశాఖాధికారిణి ఐషా, రైతులు పాల్గొన్నారు.

నూతిగుంటపల్లి క్రీడాకారుడి ప్రతిభ



అవార్డు అందుకుంటున్న గిరీష్‌కుమార్‌రెడ్డి

రామచంద్రాపురం: మండలంలోని నూతిగుంటపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎద్దల చంద్రశేఖర్‌రెడ్డి కుమారుడు ఎద్దల గిరీష్‌కుమార్‌రెడ్డి ఆంధ్ర ప్రీమియర్ లీగ్- 2023 క్రికెట్ టోర్నమెంట్‌లో సత్తా చాటుతున్నాడు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ వైజాగ్ వారియర్స్ జట్టు రూ. 2.3 లక్షల వేలం పాటలో దక్కించుకుంది. సోమవారం విశాఖపట్టణంలో జరిగిన వైజాగ్ వారియర్స్ వర్సెస్ రాయలసీమ కింగ్స్ మధ్య మ్యాచ్ జరిగింది. ఇందులో రాయలసీమ కింగ్స్ గెలుపు కోసం 6 పరుగులు కావాల్సిన ఉండగా గిరీష్‌కుమార్‌రెడ్డి 5 పరుగులకే కట్టడి చేసి వికెట్ తీసి మ్యాచ్‌ను టై చేశాడు. దీంతో సూపర్ ఓవర్లో బౌలింగ్ చేసే అవకాశాన్ని గిరీష్‌కుమార్‌రెడ్డికి ఇచ్చారు. ఇతను సూపర్ ఓవర్లో ఒక పరుగు మాత్రమే ఇచ్చి రెండు వికెట్లు తీశాడు. అందులో భారతజట్టు, ఏపీఎల్‌కు ఆడిన హనుమవిహారి వికెట్ కావడం విశేషం. దీంతో వైజాగ్ వారియర్స్ జట్టును గెలిపించి గేమ్ చేంజర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందుకున్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు అతన్ని అభినందించారు.

గంగమ్మకు పొంగళ్లు



గంగమ్మకు పొంగళ్లు సమర్పిస్తున్న మహిళలు

రామచంద్రాపురం: రాయల చెరువు గ్రామంలో మంగళవారం గంగమ్మకు మహిళలు పొంగళ్లు సమర్పించారు. అమ్మవారికి పొంగళ్లు పెట్టి దీప ధూప నైవేద్యాలతో మొక్కులు తీర్చుకున్నారు.

విజయవంతంగా విద్యుత్ బస్సుల ఆపరేటింగ్

తిరుపతి అర్బన్: విద్యుత్ బస్సుల ఆపరేటింగ్ విజయవంతంగా సాగుతోందని అలిపిరి డిపో మేనేజర్ సింగం హరిబాబు పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తొలిసారిగా తిరుపతిలోని అలిపిరి డిపోను విద్యుత్ బస్సుల డిపోగా ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. వంద విద్యుత్ బస్సులను అలిపిరి డిపో నుంచి ఆపరేటింగ్ చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. అయితే డ్రైవర్లు, చార్జింగ్ పాయింట్లు, చిన్నచిన్న సమస్యలతో కొద్ది రోజుల పాటు 90శాతం సర్వీసులను మాత్రమే అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ప్రస్తుతం వంద శాతం విద్యుత్ బస్సులను దిగ్విజయంగా నడుపుతున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రయాణికులు సైతం విద్యుత్ బస్సుల్లో ప్రయాణం చేయడానికి ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు. మెరుగైన సౌకర్యాలతో కాలుష్య నివారణ నేపథ్యంలో విద్యుత్ సర్వీసుల ఆపరేటింగ్ విజయవంతమైనట్లు వెల్లడించారు.

ఘనంగా జానపద దినోత్సవం

తిరుపతి కల్చరల్: రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ జానపద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జానపద కళాకారుడు సొంబోలు హరినాథ్‌ను జ్ఞాపిక, శాలువతో ఘనంగా సత్కరించి అభినందించారు. రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి, రంగస్థలి కార్యదర్శి కేఎస్.రాజా, రాజశేఖర్‌రెడ్డి, టి.సుబ్రమణ్యంరెడ్డి, పొన్నాల జేజిరెడ్డి, విజయకుమార్, జయంత్ పాల్గొన్నారు.

నేడు మహిళలకు వంటల పోటీలు

తిరుపతి కల్చరల్: కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూనర్స్ ఏపీ చాప్టర్ ఆధ్వర్యంలో బుధవారం మహిళలకు తృణధాన్యాల వంటలు, కేక్‌ల తయారీపై పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షురాలు రాధికా చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. వరదరాజనగర్‌లోని శ్రీబాలాజీ డ్రగ్స్ ట్రేడర్స్ వెల్ఫేర్ భవన్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటాయని పేర్కొన్నారు. విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. అవకాశాన్ని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: తిరుమల శ్రీవారిని మంగళవారం రాష్ట్ర మంత్రి ఆర్కే రోజా, తెలంగాణ ఎమ్మెల్యే మయినంపల్లి హనుమంతరావు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. అధికారులు లడ్డు, ప్రసాదాలు అందజేశారు.

25న చలో విజయవాడ

భాకరాపేట: ఈనెల 25న తలపెట్టిన వీఆర్‌ఏల చలో విజయవాడను జయప్రదం చేయాలని తిరుపతి సీఐటీయూ జిల్లా కార్యదర్శి మధుసూదనరావు పేర్కొన్నారు. మంగళవారం చిన్నగొట్టిగల్లులో వీఆర్‌ఏల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్‌ఏలకు పేస్కేల్ అమలు చేయాలన్నారు. అర్హులైన వారికి వీఆర్‌ఓ, అటెండర్ పోస్టులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డీఏ రికవరీ నిలిపివేసి, డీఏతో కూడిన వేతనం ఇవ్వాలన్నారు. వీఆర్‌ఏ సంఘం నాయకులు రమణయ్య, ప్రేమకుమార్, బాబు, రెడ్డి రాణి పాల్గొన్నారు.

మూలస్థాన ఎల్లమ్మ హుండీ ఆదాయం రూ.6.33లక్షలు



హుండీ కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

చంద్రగిరి: చంద్రగిరి గ్రామదేవత మూలస్థాన ఎల్లమ్మ హుండీ కానుకలను మంగళవారం ఆలయ ధర్మకర్త యారాశి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది లెక్కించారు. జూలై 5వ తేదీ నుంచి సోమవారం వరకు (48 రోజులు) హుండీ ద్వారా వచ్చిన కానుకలను లెక్కించారు. అమ్మవారి హుండీ ద్వారా రూ.6,33,207 నగదు వచ్చినట్లు ఆయన తెలిపారు. జిల్లా దేవదాయ సహాయ కమిషనర్ ఏకాంబరం, ఈఓ పుట్టా రామకృష్ణారెడ్డి, పాలక మండలి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.